సాక్షి
ఆదిలాబాద్
సోమవారం । 11 । డిసెంబర్ । 2023



దీవించు తల్లీ..
కార్తీక మాసం చివరి ఆదివారం సందర్భంగా కౌటాలలో కంకలమ్మ– కేతేశ్వరస్వామి ఆలయ మహా జాతర ఘనంగా నిర్వహించారు. 8లో▸

పీఎం కిసాన్ కేంద్రాల్లో సేవల్లేవ్..!



పీఎం కిసాన్ కేంద్రాల్లో రైతులకు తగిన సేవలు అందడం లేదు. ఎరువుల కంపెనీలు చేతులెత్తేస్తుండగా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. 8లో▸

గరిష్టం/కనిష్టం
27.0/16.0

వాతావరణం
వాతావరణం పొడిగా ఉంటుంది. గాలిలో తేమశాతం పెరగనుంది. వేకువజామున పొగమంచు ప్రభావం కనిపిస్తుంది.

న్యూస్‌రీల్

ప్రశాంతంగా ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఈవో ప్రణీత

ఆదిలాబాద్‌టౌన్: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్) పరీక్ష ప్రశాంతంగా జరిగింది. జిల్లా కేంద్రంలో రెండు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ బాలికల పాఠశాల, బాలక్ మందిర్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్ష కొనసాగింది. పరీక్షకు 562 మంది విద్యార్థులు హాజరు కాగా, 12 మంది గైర్హాజరయ్యారు. ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రాన్ని డీఈవో ప్రణీత పరిశీలించారు.

మానవ హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత

ఆదిలాబాద్‌టౌన్: మానవ హక్కులను పరిరక్షించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సార్క్ నేషనల్ హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పున్నంరావు అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ విశ్రాంతి భవనం ఎదుట అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మానవ వనరులను వినియోగించుకోవాలన్నారు. 12 హక్కులతో పాటు పలు చట్టాలు ఉన్నాయని, వాటిని కాపాడే బాధ్యత మనందరిపై ఉందన్నారు. గ్రామీణ, పట్టణవాసులకు చట్టాలపై అవగాహన కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

పులుల సంచారంపై అప్రమత్తంగా ఉండాలి

- డీఎఫ్‌వో బాజీరావ్ ప్రశాంత్ పాటిల్



అటవీ ప్రాంతంలో అధికారులతో మాట్లాడుతున్న డీఎఫ్‌వో

తాంసి: మహారాష్ట్రలోని తిప్పేశ్వర్ అభయారణ్యం నుంచి తరుచూ పెన్‌గంగ దాటి వస్తున్న పులుల సంచారంపై సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా అటవీశాఖ అధికారి బాజీరావ్ ప్రశాంత్ పాటిల్ అన్నారు. భీంపూర్ మండలంలోని అర్లి(టి) ప్రాంతాన్ని డీఎఫ్‌వో ఆదివారం పరిశీలించారు. పులుల సంచారంనకు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. నది దాటే ప్రాంతాల వద్ద సీసీ కెమెరాలు అమర్చి వాటి కదలికలు పరిశీలించాలన్నారు. ప్రస్తుతం మండలంలో ఎక్కడా పులి సంచారం లేదని తెలిపారు. వారి వెంట ఎఫ్‌ఆర్వో గులాబ్‌సింగ్, సెక్షన్, బీట్ అధికారులు గులాబ్, సాయి, కేశవ్ సిబ్బంది ఉన్నారు.



ఇక్కడ కనిపిస్తున్న విద్యార్థిని గుమ్ముల శైలజ. ఈమెది సిరికొండ. ఇచ్చోడలోని ఓ ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ చదువుతోంది. ప్రతి రోజు కాలేజీకి వెళ్లాలంటే ప్రైవేట్ వాహనాలే దిక్కు. రానూపోను రూ.50 ఖర్చు చేయాల్సి వస్తోందని చెబుతుంది. మండలం ఏర్పాటైన కొత్తలో విద్యార్థుల కోసం ప్రత్యేకంగా బస్సులు నడిపినప్పటికీ, తర్వాత సర్వీస్‌ను నిలిపివేశారు. దీంతో ఆర్థిక భారం తప్పట్లేదు అని వాపోతుంది ఈమె. ప్రస్తుతం మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీ ఉచిత సేవలు అందుబాటులోకి వచ్చినా వినియోగించుకోలేకపోతున్నట్లు చెబుతోంది. ఒక్క శైలజ మాత్రమే కాదు.. చాలా మంది విద్యార్థినులదీ ఇదే పరిస్థితి.



ఇక్కడ కనిపిస్తున్న మహిళ నీలాదేవి. తాంసి మండలం అంబుగాం గ్రామం. మండల కేంద్రం నుంచి నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న గ్రామానికి రహదారి సౌకర్యం ఉంది. అయితే బస్సు సదుపాయం లేకపోవడంతో మండల కేంద్రం నుంచి నడక తప్పని పరిస్థితి. అత్యవసర పరిస్థితుల్లో తమ ఇక్కట్లు వర్ణనాతీతం అంటుంది ఈమె. కాంగ్రెస్ ప్రభుత్వం ఉచిత ప్రయాణ సౌకర్యం అందుబాటులోకి తెచ్చినా తాము వినియోగించుకోలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తోంది.



సిరికొండ మండలకేంద్రం

బస్సే రాదాయే..!

- మహాలక్ష్మి.. కరుణించేదెలా!
- పల్లెలకు చేరని ప్రగతి రథాలు
- ఉచిత ప్రయాణానికి దూరమవుతున్న అతివలు
- ఆర్టీసీ సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తులు



తాంసి మండలంలోని గొల్లఘాట్ గ్రామం

ఆదిలాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పిస్తూ ప్రతిష్టాత్మకంగా మహాలక్ష్మి పథకానికి శ్రీకారం చుట్టిన సంగతి తెలిసిందే. ప్రజా రవాణా వ్యవస్థను మహిళలకు మరింత అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో ప్రవేశపెట్టిన ఈ పథకం చాలామందికి చేరడం లేదు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ కలిపి మొత్తం 487 సర్వీసులున్నాయి. రోజుకు సుమారు లక్ష యాభై వేల మంది మహిళా ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. అయితే ఉమ్మడి జిల్లాలోని ఎన్నో మారుమూల గ్రామాలకు నేటికీ బస్సు సౌకర్యం లేక ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సిన దుస్థితి. దీంతో వారిపై రవాణా భారం పడుతుంది. ప్రభుత్వం ఉచిత ప్రయాణ సౌకర్య పథకాన్ని ప్రవేశపెట్టినప్పటికీ ఎంతోమంది అతివలు ఈ అదృష్టానికి నోచుకోవడం లేదు.

కారణాలు అనేకం..
ఆదాయం సరిగా రావడం లేదని ఉద్దేశంతో జిల్లాలోని పలు గ్రామాలకు ఆర్టీసీ బస్సులను నడపడం మానేసింది. కరోనా మహమ్మారి అనంతరం పెద్ద సంఖ్యలో పల్లెలకు బస్సులను నిలిపివేసిన ఆర్టీసీ..తిరిగి ఆయా రూట్లలో పునరుద్ధరించడంలో వెనకడుగు వేసింది. ఆదాయం సరిగా రావడం లేదని, రహదారి సౌకర్యం సరిగా లేదనే కారణాలతో బస్సులను పూర్తిస్థాయిలో నిలిపేయడం వలన పల్లె ప్రజానీకానికి ప్రజా రవాణా వ్యవస్థ దూరమవుతోంది.

మండల, జిల్లా కేంద్రాలకు నిత్యం రాకపోకలు సాగించే మహిళలే పల్లె వెలుగు బస్సుల్లో అధికంగా ప్రయాణిస్తుంటారు. వారు బస్సు సౌకర్యం లేక ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ప్రభుత్వం ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకువచ్చిన నేపథ్యంలో అన్ని రూట్లకు బస్సులను నడిపితే పెద్ద సంఖ్యలో మహిళలకు ఈ పథకం లబ్ధి చేకూరుస్తుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఆర్టీసీ బస్సు వెళ్లని గ్రామాలెన్నో..
జిల్లాలోని 18 మండలాల్లో 556 గ్రామాలు ఉండగా, వీటిలో ఆర్టీసీ బస్సు వెళ్లని గ్రామాలు ఎన్నో ఉన్నాయి.

- సిరికొండ మండల కేంద్రానికే బస్సు లేకపోవడం గమనార్హం. అలాగే మండల పరిధిలో ఉన్న 52 గ్రామాలకు ఆర్టీసీ సౌకర్యం లేదు. ముఖ్యంగా విద్యార్థుల కోసం ఉదయం, సాయంత్రం సమయంలో బస్సులను ప్రత్యేకంగా నడిపేవారు. ప్రస్తుతం వాటిని నిలిపివేయడంతో ఆయా గ్రామాలవాసులు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు.
- ఇచ్చోడ మండలంలో 32 గ్రామాలు ఉండగా ఒక్క గ్రామానికి కూడా బస్సు వెళ్లని పరిస్థితి.
- బజార్‌హత్నూర్ మండలంలోని 64 గ్రామాలు ఉండగా ఇందులో 54 బస్సు సౌకర్యానికి దూరంగా ఉంటున్నాయి.
- తాంసి మండలంలోని తాంసి మండల కేంద్రం, గిరిగాం, అంబుగాం, అట్నం గూడా, భీంపూర్ మండలంలోని గొల్లఘాట్, గుబిడిపల్లి, గుంజాల గ్రామాలకు, జైనథ్ మండలంలోని మాకోడ,పిప్పల్ గావ్ గ్రామాలకు బస్సు సదుపాయం అందుబాటులో లేదు.
- నేరడిగొండ మండల కేంద్రం నుంచి గతంలో బొందిడి గ్రామం వరకూ ఓ సర్వీస్ నడిపేవారు. ప్రస్తుతం దానిని నిలిపివేయడంతో అటువైపుగా ఉన్న వడూరు, బొందిడి, భవాని తండా, గంభీర్ తండా, దర్బా, దర్బాతండా సుర్దాపూర్, రేంగన్‌వాడి గ్రామాలకు వెళ్లే వారికి ప్రైవేట్ వాహనాలే దిక్కువుతున్నాయి.
- బేల మండలంలోని బాధి, హేటి, దేవోజిగూడ, భవానిగూడ, రాయిపూర్ తండా, దుబ్బగూడా వంటి పల్లెలకు బస్సు సౌకర్యం లేదు.
- అలాగే ఉట్నూరు, నార్నూరు, ఇంద్రవెల్లి, గాదిగూడ, తలమడుగు, బోథ్ మండలాల్లోనూ ఎన్నో గ్రామాల జనం ప్రజా రవాణా వ్యవస్థకు దూరమవుతున్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలి



సిరికొండలోని మండల పరిషత్ పాఠశాలలో ఉపాధ్యాయురాలుగా విధులు నిర్వర్తిస్తున్నాను. బస్సు సౌకర్యం లేక నేను ఇచ్చోడ నుంచి సిరికొండకు ప్రైవేట్ వాహనాల్లో రావాల్సి వస్తుంది. సమయానికి వాహనాలు లేక అప్పుడప్పుడు ఆలస్యమవుతుంది. ఇప్పటికైనా మండలానికి బస్సు సౌకర్యం కల్పించాలి.
– ఉష, ఉపాధ్యాయురాలు, సిరికొండ

మహాలక్ష్మి వర్తించట్లే..!



మా గ్రామాలకు బస్సే రానప్పుడు మహాలక్ష్మి పథకం ఎట్ల వర్తిస్తది. పథకంతోని పైసలు లేకుండా ఎంత దూరమైనా పోవచ్చని చెప్తున్నరు. ఇట్లాంటి పథకం పెట్టినట్టు చాలామంది మహిళలకు తెల్వది. ఈ పథకం గురించి అందరికీ చెప్పుడే కాకుండా దీన్ని వాడుకునేలా ప్రచారం చేయాలి.
– సంగీత, గిరిజాయి, బజార్‌హత్నూర్

బస్సు నడిపిస్తే మంచిగుంటది..



అప్పట్లో మా ఊరు సైడు బస్సు నడిచేది. ఇప్పుడు బంద్ అయింది. అప్పటి నుంచి ఆటోలల్లనే నేరడిగొండకు పోతున్నం. ఇప్పుడు ఫ్రీగా బస్సులో పోవచ్చని చెబుతున్నరు. సార్లు మళ్లా మా ఊరికి బస్సు నడిపేట్లు చూస్తే మంచిగుంటది.
– ఆడే పారు బాయి, రెంగన్వాడి, నేరడిగొండ

అప్పుడే ఫాయిదా ...



మా ఊరుకు సక్కగా రోడ్డు గాని బస్సు సౌకర్యం గాని లేదు. అసలు మాకు బస్సు ఫ్రీ చాలు అయిందనే విషయమే తెలవదు. ఫ్రీగా బస్సు ఎక్కాలంటే మా ఊరు నుంచి ఆటో ఎక్కి సోన్‌కాస్ గ్రామం లేకపోతే బేల వరకు పో వాల్సి వస్తది. అక్కడ నుంచి వేరే దగ్గరికి పో వాలనుకుంటే ఫ్రీ బస్సు ఫాయిదా అవుతది.
– తులబాయి, రాయ్‌పూర్ తండా, బేల

'మహాలక్ష్మి'కి భారీ స్పందన

- తొలిరోజు 65,953 మంది ఉచిత ప్రయాణం



బస్సు ఎదుట యువతుల సంబురం

ఆదిలాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 9న ప్రారంభించిన మహాలక్ష్మి పథకానికి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా భారీ స్పందన లభించింది. మహిళా ప్రయాణికులు బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకున్నారు. ఆర్టీసీ రీజియన్ పరిధిలో 65,953 మంది మహిళా ప్రయాణికులు తొలిరోజు ఉచితంగా బస్సుల్లో ప్రయాణించారు. అత్యధికంగా మంచిర్యాల డిపో పరిధిలో 18,331 మంది,నిర్మల్‌లో 16,627, ఆదిలాబాద్‌లో 10,874, భైంసాలో 10,519, ఆసిఫాబాద్‌లో 5,509, ఉట్నూరు డిపో పరిధిలో 4,093 మంది పథకాన్ని సద్వినియోగం చేసుకున్నట్లు ఆర్టీసీ అధికారులు వెల్లడించారు. రాబోయే రోజుల్లో మరింతగా డిమాండ్ పెరిగే అవకాశం ఉన్నట్లు అంచనా వేస్తున్నారు.

నేటి నుంచి మళ్లీ ప్రజావాణి

- అర్జీలు స్వీకరించనున్న కలెక్టర్

కైలాస్‌నగర్: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో నిలిచిపోయిన ప్రజావాణి అర్జీల స్వీకరణ నేటి నుంచి పునఃప్రారంభం కానుంది. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించనున్న కార్యక్రమంలో కలెక్టర్ రాహుల్‌రాజ్ బాధితుల నుంచి అర్జీలు స్వీకరించనున్నారు. ఎన్నికల షెడ్యూల్ వెలువడిన ఈ ఏడాది అక్టోబర్ 9వ నుంచి ప్రజావాణి కార్యక్రమాన్ని నిలిపివేశారు. ప్రసుతం ఎన్నికల ప్రక్రియ ముగిసి కొత్త ప్రభుత్వం కొలువు దీరడం, రాష్ట్రస్థాయిలో ప్రభుత్వం ప్రజా సమస్యలను తెలుసుకునేందుకు ప్రత్యేక చొరవ చూపడంతో జిల్లా స్థాయిలోనూ ప్రజావాణిని పునరుద్ధరించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లా ప్రజలు వారి సమస్యల పరిష్కారం కోసం గ్రీవెన్స్‌కు హాజరై నివేదించుకోవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

కార్తీక వనభోజనం

తాంసి: భీంపూర్ మండలం అర్లి(టి) అంగన్‌వాడీ కేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం కార్తీక వనభోజనాలు చేపట్టారు. గ్రామంలోని 1వ అంగన్‌వాడీ సెంటర్ పరిధిలోని చిన్నారులు, తల్లులు టీచర్ స్వరూప ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని గాంధీ పార్క్‌కు తరలివచ్చారు. వన భోజనాల అనంతరం చిన్నారులు పార్క్‌లో సందడి చేశారు.

ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యం

- పథకాలు సద్వినియోగం చేసుకోవాలి
- ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఆదిలాబాద్: ప్రభుత్వాలు ఏవైనా ప్రజా సంక్షేమమే వాటి అంతిమ లక్ష్యమని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని రిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ప్రాంగణంలో ఆదివారం మహాలక్ష్మి, ఆరోగ్యశ్రీ చేయూత పథకాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళల సౌకర్యార్థం ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించే మహాలక్ష్మి పథకం అమలు అభినందనీయమన్నారు. ఈ పథకాన్ని మహిళలంతా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గతంలో ఆరోగ్యశ్రీ పథకం ద్వారా రూ.5 లక్షల వరకు మాత్రమే పరిమితి ఉండేదన్నారు. ప్రధాని మోదీ ప్రతీ నిరుపేదకు నాణ్యమైన వైద్యం అందించాలని ఉద్దేశంతో రూ.10లక్షల వరకు వైద్య ఖర్చులు భరించేలా ఆయుష్మాన్ భారత్ పథకానికి శ్రీకారం చుట్టారన్నారు. ఈ పథకాన్ని రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ–ఆయుష్మాన్ భారత్ కింద అమలవుతుందని వెల్లడించారు. నియోజకవర్గ పరిధిలో అన్ని ప్రభుత్వ పథకాలు అర్హులైన వారందరికీ అందేలా చూస్తానన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఆర్‌ఎం సోలోమన్, డీఎంహెచ్‌ఓ నరేందర్ రాథోడ్, రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, డీఎం కల్పన, ఆర్టీసీ, వైద్యరోగ్యశాఖ అధికారులు, నాయకులు లాలా మున్నా, జోగు రవి, రఘుపతి, సోమ రవి తదితరులు పాల్గొన్నారు.



ఆరోగ్యశ్రీ పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

ఆ అక్రమార్కుల్లో గుబులు

- ఇన్నాళ్లు అందినకాడికి చేతివాటం
- ప్రభుత్వం మారడంతో బదిలీ యత్నం



మున్సిపల్ కార్యాలయం

కైలాస్‌నగర్: రాజకీయ పరిస్థితుల్లో అనూహ్య మార్పులొచ్చాయి. ఈ క్రమంలో ఆదిలాబాద్ మున్సిపల్‌లో పనిచేసే కొంతమంది అవినీతి అధికారుల్లో గుబులు మొదలైంది. ఇన్నాళ్లు రాజకీయ అండదండలతో ఇష్టారాజ్యంగా వ్యవహరించిన సదరు అధికారుల్లో ప్రభుత్వ మార్పు కలవరానికి గురిచేస్తోంది. ఇంకా ఇక్కడే కొనసాగితే తమ బండారం బయటపడి మొదటికే మోసం వస్తుందని గ్రహించిన ఆ అక్రమార్కులు స్వచ్ఛంద బదిలీ కోసం ప్రయత్నాలు మొదలుపెట్టినట్లు బల్దియా వర్గాల్లో జోరుగా చర్చ సాగుతోంది. వేరే చోటుకు స్థానచలనం జరిగితే ఎలాంటి ఇబ్బంది లేకుండా ఉండవచ్చనే ఉద్దేశంతో ఆ శాఖ ఉన్నతాధికారులను కలిసి వేడుకుంటున్నట్లుగా తెలిసింది.

దీర్ఘకాలంగా ఒకే చోట!
మున్సిపాలిటీలోని ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక విభాగంలో గల ఇద్దరు అధికారులు నిబంధనలకు విరుద్ధంగా దీర్ఘకాలంగా విధులు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఓ అధికారి మూడేళ్ల పాటు ఒక చోట పనిచేసే అవకాశముంది. కానీ సదరు అధికారులు రాజకీయ పలుకుబడి ఉపయోగించుకుని ఐదారేళ్లకు పైగా ఇక్కడే తిష్టవేశారు. పరిచయాలు పెంచుకుని తమదైన శైలిలో అక్రమాలకు తెరలేపారనే చర్చ సాగుతోంది. ఇంజినీరింగ్ విభాగంలో పనిచేసే అధికారి అయితే ఏకంగా బినామీ పేర్లతో టెండర్లు సొంతం చేసుకుని పట్టణంలో పలు అభివృద్ధి పనులు చేపట్టారనే ఆరోపణలున్నాయి. కౌన్సిలర్లు, బల్దియా ఉద్యోగులు దీనిని బహిరంగంగానే చెబుతున్నారు. పనులను పర్యవేక్షించి పారదర్శకంగా, నాణ్యతతో జరిగేలా చూడాల్సిన సదరు అధికారే కాంట్రాక్టర్ అవతారమెత్తి రూ.కోట్లకు పడగలెత్తారనే విమర్శలున్నాయి. ప్రణాళిక విభాగంలో పనిచేసే మరో అధికారి సైతం ఇక్కడే ఏళ్లుగా పాతుకుపోయారు. పట్టణంలో జరిగే అక్రమ కట్టడాలు, అక్రమ లేఅవుట్లపై చర్యలు చేపట్టాల్సిన సదరు అధికారి వారితో కుమ్మక్కై అందిన కాడికి దండుకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏదైనా అక్రమం జరిగినట్లు ఫిర్యాదు అందితే చాలు దాన్ని తనకు అనుకూలంగా మలుచుకుని కోట్ల రూపాయలు ఆర్జించినట్లుగా తోటి ఉద్యోగులే గుసగుసలాడుకోవడం గమనార్హం. ఇలా ఈ ఇద్దరు అధికారులు రెండు చేతుల ఆర్జించినట్లుగా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

బదిలీ కోసం యత్నాలు ?
ఇన్నాళ్లు అక్రమంగా అందిన కాడికి దండుకున్న సదరు అధికారులు మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో ముందస్తుగానే తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారనే చర్చ మొదలైంది. రాజకీయంగా ఎలాంటి ఒత్తిళ్లు, ఇబ్బందులు ఎదురుకాక ముందే చాప చుట్టేసేలా బదిలీ ప్రయత్నాలు చేపట్టినట్లుగా బల్దియా వర్గాలు గుసగుసలాడుతున్నాయి. శాఖకు సంబంధించిన ఉన్నతాధికారులతో పాటు అధికార పార్టీ ద్వితీయ శ్రేణి నాయకులను సంప్రదించి తమను మరో చోటుకు బదిలీ చేసేలా చూడాలని వేడుకుంటున్నట్లుగా తెలుస్తోంది. ఉన్నతాధికారులను ప్రసన్నం చేసుకునేందుకు అన్ని విధాలా ప్రయత్నాలు సాగిస్తున్నట్లుగా సమాచారం.

'ఎస్‌ఎంసీ'ల గడువు పొడిగింపు

- ఇప్పటికే మూడు సార్లు
- తాజాగా ఈనెలాఖరు వరకు..
- పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు
- కొత్త కమిటీలు లేక పాఠశాలల నిర్వహణ అస్తవ్యస్తం

జిల్లాలో..

ప్రాథమిక పాఠశాలలు	466
ప్రాథమికోన్నత పాఠశాలలు	105
ఉన్నత పాఠశాలలు	130
విద్యార్థుల సంఖ్య	65వేలు



భీంపూర్ పాఠశాల



గడువు పొడిగిస్తూ విద్యాశాఖ జారీ చేసిన ఉత్తర్వు ప్రతి

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థుల చదువుతో పాటు పాఠశాలకు మంజూరైన నిధులు సక్రమంగా వినియోగించేలా స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్‌ఎంసీ)ల పాత్ర కీలకం. ఇలాంటి ప్రాధాన్యత ఉన్న కమిటీల నిర్వహణ ప్రస్తుతం నీరుగారుతోంది. ఆ పాఠశాలలో తమ పిల్లలు చదువు పూర్తి చేసుకొని ఉన్నత విద్యకు వెళ్లినప్పటికీ పాత వారే కమిటీ సభ్యులుగా, చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. దీనికితోడు బడి వైపు కన్నెత్తి చూడకపోవడంతో ఎస్‌ఎంసీల లక్ష్యం నెరవేరని పరిస్థితి. 2019లో ఈ కమిటీలను ఏర్పాటు చేయగా, 2021లో గడువు ముగిసింది. ఇప్పటికే మూడుసార్లు గడువు పెంచిన విద్యాశాఖ తాజాగా మరో నెల పాటు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 31 వరకు పొడిగించగా.. కొత్త కమిటీలు ఏర్పాటయ్యే వరకు వీరే కొనసాగుతారని స్పష్టం చేసింది.

నీరుగారుతున్న లక్ష్యం..
విద్యార్థుల తల్లిదండ్రుల సహకారంతో పాఠశాల నిర్దేశించుకున్న లక్ష్యాలను ఎస్‌ఎంసీల ద్వారా సులభంగా సాధించే అవకాశం ఉంటుంది. విద్యార్థులు సక్రమంగా పాఠశాలకు హాజరు కాకపోయినా, బడీడు పిల్లలు బడి బయట ఉన్నా, పాఠశాలకు అభివృద్ధి కోసం ఏవైనా నిధులు మంజూరైనా చర్చించి పనులు చేపట్టాలి. మరోవైపు ఇప్పటికే సర్కారు బడుల్లో విద్యార్థుల సంఖ్య రోజురోజుకు తగ్గుముఖం పడుతుంది. తల్లిదండ్రులు ప్రైవేట్ వైపు మొగ్గు చూపుతుండడంతో వీటిని మరింత బలోపేతం చేయాల్సిన ఆవశ్యకత ఏర్పడింది. అయితే కమిటీల గడువు ముగిసినప్పటికీ పదవి కాలం తరచూ పొడిగిస్తుండడంతో అనుకున్న లక్ష్యాలు నెరవేరడం లేదనే విమర్శలున్నాయి.

తల్లిదండ్రుల భాగస్వామ్యం..
ఎస్‌ఎంసీలో విద్యార్థుల తల్లిదండ్రుల భాగస్వామ్యం కీలకం. ఉపాధ్యాయులు సక్రమంగా విధులకు హాజరవుతున్నారా.. సమయపాలన పాటిస్తున్నారా అనే వాటిని ఈ కమిటీ పర్యవేక్షించాలి. దీంతో పాటు నాణ్యమైన బోధన, భోజనం అందిస్తున్నారా అనే విషయాలపై ఎప్పటికప్పుడు ఆరా తీయాల్సి ఉంటుంది. విద్యార్థుల అభ్యసన తీరుపై సమావేశం నిర్వహించి తల్లిదండ్రులకు వివరించాలి. పాఠశాలకు నిధులు మంజూరైతే తీర్మానం చేసి పనులు చేట్టాల్సి ఉంటుంది. ప్రస్తుతం మన ఊరు –మనబడి పనులు కొనసాగుతున్నప్పటికీ చాలా ఎస్‌ఎంసీలు వీటి నిర్వహణ పట్టించుకోవడం లేదు. దీంతో కాంట్రాక్టర్లు నాసిరకం పనులు చేపట్టి చేతులు దులుపుకుంటున్నారు. ఆరు నెలల్లోగా మౌలిక వసతులకు సంబంధించి పనులు పూర్తి చేయాల్సి ఉండగా, దాదాపు ఏడాదిన్నర గడిచినా పనులు పూర్తి కావడం లేదనే విమర్శలున్నాయి. ప్రాథమిక పాఠశాలల్లో 15 మంది సభ్యులు, ప్రాథమికోన్నత పాఠశాలల్లో 21 మంది, ఉన్నత పాఠశాలల్లో 15 మంది సభ్యులు ఉంటారు. వీరిలో నుంచి చైర్మన్, వైస్ చైర్మన్‌ను ఎన్నుకోగా, మిగతా వారు సభ్యులుగా కొనసాగుతారు. ప్రధానోపాధ్యాయులు కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. ఆ పాఠశాలల్లో కమిటీ సభ్యుల పిల్లల చదువు పూర్తయి ఇతర పాఠశాలల్లో చేరితే వారి తల్లిదండ్రులను కమిటీ నుంచి తొలగించాల్సి ఉంటుంది. అయితే ఏళ్ల గడుస్తున్నా ఇంకా పాతవారినే కొనసాగిస్తుండడం గమనార్హం.

కొత్త ప్రభుత్వంలోనైనా ఏర్పాటయ్యేనా..
బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన ఎస్‌ఎంసీల పదవికాలం ముగిసినా పలుమార్లు పొడగిస్తూ వచ్చారు. ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. విద్యా శాఖను ఇంకా ఎవరికి కేటాయించలేదు. సీఎం రేవంత్‌రెడ్డి వద్దే ఆ శాఖ ఉండడంతో ప్రత్యేక దృష్టి సారించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నెల తర్వాత అయిన కొత్త కమిటీలు ఏర్పాటు చేస్తే విద్యార్థులకు ప్రయోజనకరంగా ఉంటుందని తల్లిదండ్రులు పేర్కొంటున్నారు.

ఈ నెలాఖరు వరకు..



ఎస్‌ఎంసీల పదవీ కాలం గతనెల 30తో ముగిసింది. దీంతో విద్యాశాఖ డైరెక్టర్ ఈనెలాఖరు వరకు లేదా కొత్త కమిటీలు ఏర్పాటయ్యేంత వరకు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం కొనసాగుతున్న కమిటీలు 2019లో ఏర్పాటయ్యాయి.
– సుజాత్‌ఖాన్, విద్యాశాఖ సెక్టోరియల్ అధికారి

క్లుప్తంగా

నిజాయితీ చాటిన ఆర్టీసీ డ్రైవర్

నిర్మల్‌టౌన్: బస్సులో ప్రయాణికుడు పోగొట్టుకున్న బ్యాగ్‌ను తిరిగి అప్పగించి ఆర్టీసీ డ్రైవర్ నిజాయితీ చాటుకున్నాడు. వివరాలు ఇలా ఉన్నాయి. ప్రయాణికుడు అభినవ్‌రెడ్డి నిర్మల్ బస్టాండ్ నుంచి ఆదివారం హైదరాబాద్ వెళ్తున్న బస్సెక్కాడు. బస్టాండ్‌కు చేరుకున్నాక అందరూ దిగి వెళ్లారు. ఈ క్రమంలో డ్రైవర్ షాకిర్ అలీకి బస్సులోని సీటులో బ్యాగ్ గమనించాడు. అందులో రూ.50 వేల నగదు, ఐఫోన్ ఉంది. అప్పుడే ఫోన్‌కు కాల్ రావడంతో డ్రైవర్ హైదరాబాద్ బస్టాండ్‌కు వచ్చి తీసుకెళ్లమని చెప్పాడు. దీంతో బాధితుడు బస్టాండ్‌కు రావడంతో స్టేషన్ మేనేజర్ వివరాలు సేకరించి, ఆ బ్యాగ్‌ను అప్పగించాడు. ఈ సందర్భంగా డ్రైవర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

బీమా కోరేగావ్ శౌర్య దినోత్సవాన్ని విజయవంతం చేయండి


మాట్లాడుతున్న రత్నజాడే ప్రజ్ఞాకుమార్

ఆదిలాబాద్‌రూరల్: జనవరి ఒకటో తేదీన జిల్లా కేంద్రంలో నిర్వహించే బీమా కోరేగావ్ శౌర్య దినోత్సవాన్ని విజయవంతం చేయాలని భారతీయ బౌద్ధ మహాసభ ఉత్తర తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రత్నజాడే ప్రజ్ఞాకుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం ఆదిలాబాద్ పట్టణంలోని భుక్తపూర్‌లోని మహా ప్రజ్ఞా బుద్ధ వీహార్‌లో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భీమా కోరేగావ్ శౌర్య దినోత్సవం సందర్భంగా ఆదిలాబాద్ పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించడం జరుగుతుందన్నారు. అందులో భాగంగానే ర్యాలీ నిర్వహణ కోసం అన్నీ ఏర్పాట్లు ఇప్పటి నుంచే చేసుకునేందుకు సమావేశం నిర్వహించుకోవడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మహా ప్రజ్ఞా బుద్ధ వీహార్ అభివృద్ధి కమిటీ రత్నజాడే ఉదయ్ కుమార్, షెడ్యూల్డ్ కులాల హక్కుల పరిరక్షణ సంస్థ యూత్ జిల్లా అధ్యక్షుడు రాజు మస్కే, సంఘమిత్ర వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు రాజు పటాడే, మాల యువ సేన పట్టణ అధ్యక్షులు జాడే సిద్ధార్థ్ పాల్గొన్నారు.

12న ఉమ్మడి జిల్లా హాకీ ఎంపిక పోటీలు

ఆదిలాబాద్: జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో ఈ నెల 12న ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో జోనల్ స్థాయి (ఉమ్మడి జిల్లా) బాలబాలికల హాకీ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎస్జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కాంతారావు ఒక ప్రకటనలో తెలిపారు. అండర్ 14, అండర్ 17 విభాగాల్లో ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అర్హులైన ఉమ్మడి జిల్లాలోని క్రీడాకారులు ఈ పోటీలకు హాజరుకావాలని తెలిపారు. ఎంపిక పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు అన్నీ ధ్రువీకరణ పత్రాలతో ఉదయం 10గంటలకు కన్వీనర్ కమలాకర్‌రెడ్డి, పోటీల ఆర్గనైజర్ జాదవ్ రవీందర్‌కు స్టేడియంలో రిపోర్ట్ చేయాలని సూచించారు.

సర్పంచ్‌కు ఎమ్మెల్యే పరామర్శ

నిర్మల్: మామడ మండలం కొరటికల్‌కు చెందిన సర్పంచ్ బాపురెడ్డి రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. వడ్డేపల్లి వద్ద కారు అదుపుతప్పి చెట్టును ఢీకొనడంతో అందులోని సర్పంచ్‌కు గాయాలయ్యాయి. జిల్లా కేంద్రంలోని ఆదిత్య ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి, బీజేపీ నేతలు వెళ్లి పరామర్శించారు.

దీవించు తల్లీ..


జనసంద్రంగా కంకలమ్మ గుట్ట




మొక్కులు చెల్లిస్తున్న భక్తులు


గుట్టపై దీపాలు వెలిగిస్తూ..

శివసత్తుల పూనకాలు.. దేవతలకు మొక్కులు.. లేత బొంగుల ఊరేగింపు–వెదురు బొంగుల కళాకృతుల ప్రదర్శన.. తరలివచ్చిన భక్తులు.. నాటకాలు.. భజనలు.. సాంస్కృతి కార్యక్రమాలు.. కార్తీక మాసం ఆఖరు ఆదివారం కౌటాల మండల కేంద్రంలోని కంకలమ్మ గుట్ట (మేదరిగిరి)పై కంకలమ్మ– కేతేశ్వర స్వామి ఆలయ 19వ మహా జాతర మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాతో పాటు ఇతర రాష్ట్రాల భక్తులు సైతం తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఆలయ కమిటీ చైర్మన్ సుల్వ కనకయ్య– కళ్యాణి ఆధ్వర్యంలో వేదపండితులు రాధాకృష్ణ శర్మ, శివరాం స్వామి, తులసిరామేశ్వర్ స్వామి ఆధ్వర్యంలో పూజలు చేశారు. సిర్పూర్(టి) ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఆసిఫాబాద్ జిల్లా ఏఎస్పీ(అడ్మిన్) అచ్చేశ్వర్‌రావు, కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. – కౌటాల


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న సభ్యులు


కొబ్బరికాయలతో మొక్కులు..


కంకలమ్మకు పట్టు వస్త్రాలతో ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు


సామగ్రి కొనుగోలు చేస్తూ..


కంకలమ్మకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు, మాజీ ఎమ్మెల్యే రాజలక్ష్మి


క్యూలైన్‌లో భక్తులు...

ఈ విజయం ప్రజలదే

- అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తా
- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్

ఇంద్రవెల్లి: ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలువడం.. ప్రజల విజయమేనని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ అన్నారు. ఎమ్మెల్యేగా గెలుపొంది ఆదివారం రాత్రి ముందుగా మండలంలోని కేస్లాపూర్ గ్రామంలోని నాగోబా ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. కేస్లాపూర్ గ్రామంలో సంప్రదాయ వాయిద్యాల మధ్య ఘన స్వాగతం పలికారు. శాలువలతో సన్మానం చేశారు. అక్కడి నుండి ముత్నూర్ చేరుకుని కుమురంభీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అక్కడి నుంచి ఇంద్రవెల్లి అమరవీరుల స్తూపం వద్దకు చేరుకుని నివాళులర్పించారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అక్కడి నుంచి ఇంద్రాదేవి ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల మత బేధాలు లేకుండా అన్ని వర్గాలను సమానంగా చూడడంతో పాటు ఖానాపూర్ నియోజకవర్గం సమస్యలను తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించి అభివృద్ధి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ పెద్దలు మెస్రం వెంకట్ రావ్, మెస్రం నాగ్‌నాథ్, మెస్రం ఆనంద్‌రావ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ముఖడే ఉత్తం, ఎండి జహిర్, ఎండీ మసూద్ ఉన్నారు.


ఎమ్మెల్యే బొజ్జు పటేల్‌కు స్వాగతం పలుకుతున్న కేస్లాపూర్ గ్రామస్తులు

సేవాలాల్ మందిర్‌కు భూమిపూజ

కైలాస్‌నగర్/నార్నూర్: మహారాష్ట్రలోని వాసిం జిల్లా మానోరా తాలుకాలోని బంజారా కాశీ పోరాదేవిలో చేపట్టిన జగదాంబ దేవి, సంత్ సేవాలాల్ మహారాజ్, రామారావ్ మహారాజ్ మందిరం నిర్మాణ భూమి పూజలో ఆదిలాబాద్ జెడ్పీ చైర్మన్ జనార్దన్ రాథోడ్, బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్‌కుమార్ పాల్గొన్నారు. మహారాష్ట్ర ప్రభుత్వం రూ.593 కోట్ల వ్యయంతో చేపట్టిన ఈ మందిర నిర్మాణ భూమిపూజ ఆదివారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. జగదాంబదేవి భక్తులు శేఖర్ మహారాజ్, బాబు సింగ్ మహారాజ్‌ల అధ్యక్షన జరిగిన ఈ కార్యక్రమానికి మహారాష్ట్ర మంత్రి సంజయ్ రాథోడ్, మాజీ కేంద్ర మంత్రి హంసరాజ్ గంగారం ఆహీర్‌లతో కలిసి భూమిపూజలో పాల్గొన్నారు. వారితో కలిసి ప్రత్యేక పూజలు చేశారు.


భూమిపూజలో జెడ్పీ చైర్మన్ జనార్దన్ రాథోడ్

రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లాకు ద్వితీయ స్థానం

ఆదిలాబాద్: నల్గొండ జిల్లా కేంద్రంలో జరిగిన 11వ రాష్ట్ర స్థాయి జూనియర్ షూటింగ్ బాల్ చాంపియన్షిప్ పోటీల్లో ఆదిలాబాద్ జిల్లా బాలికల జట్టు రెండో స్థానంలో నిలిచింది. ఫైనల్ మ్యాచ్‌లో ఆదిలాబాద్ జట్టు సూర్యాపేట బాలికల జట్టుపై రెండు పాయింట్ల తేడాతో తృటిలో విజయాన్ని చేజార్చుకుంది. జట్టులో వైష్ణవి, సింధు రాజారాణి అత్యుత్తమంగా రాణించారని షూటింగ్ బాల్ సంఘం జిల్లా కార్యదర్శి హరిచరణ్ పేర్కొన్నారు. వారి వెంట కోచ్, మేనేజర్లు అజయ్, జ్యోతి ఉన్నారు. జట్టు ద్వితీయ స్థానంలో నిలువడంపై జిల్లా షూటింగ్ బాల్ సంఘం అధ్యక్షుడు సాయిని రవికుమార్, డీవైఎస్‌ఓ వెంకటేశ్వర్లు, జిల్లా గిరిజన క్రీడల అధికారి కోరెడ్డి పార్థసారథి తదితరులు అభినందించారు.


ఆదిలాబాద్ జిల్లా జట్టు

బాసరలో పేలుడు కలకలం

నిర్మల్: బాసర జ్ఞాన సరస్వతీ ఆలయం సమీపంలో పేలుడు కలకలం రేపింది. ఆలయ సమీపంలో నిర్మాణ పనుల్లో భాగంగా ఆదివారం జిలెటిన్ స్టిక్స్ ఉపయోగించి రాళ్లు పేల్చారు. వాటి నుంచి రాళ్ల ముక్కలు సమీపంలో పార్కింగ్ చేసిన కార్లపై పడటంతో స్థానికులు కంగారు పడ్డారు. ఇలాంటి ఘటనల విషయంలో జాగ్రత్తగా ఉండేలా చర్యలు తీసుకోవాలని బాధితులు పేర్కొన్నారు.

గోదావరిలో చేపల వేట

లోకేశ్వరం: మండలంలోని పంచగుడి గ్రామ సమీపంలోని గోదావరి వంతెన వద్ద ఆదివారం సాయంత్రం సూర్యుడు అస్తమిస్తున్న వేళ మత్స్యకారుల చేపల వేట దృశ్యం సందర్శకులను ఆకట్టుకుంది. గోదావరి నదిలో రోజూ ఇలా తెప్పలపై వెళుతూ మత్స్యకారులు చేపలు పట్టి గ్రామాల్లో విక్రయిస్తున్నారు.



పీఎం కిసాన్ కేంద్రాల్లో సేవల్లేవ్..!

- చేతులెత్తేసిన ఎరువుల కంపెనీలు
- చోద్యం చూస్తున్న అధికారులు

నేరడిగొండ: కేంద్ర ప్రభుత్వం ఆర్భాటంగా ఏర్పాటు చేసిన పీఎం కిసాన్ కేంద్రాల్లో రైతులకు తగిన సేవలు అందడం లేదు. రైతులకు అన్నిరకాల సేవలు ఒకేచోట అందించేలా ఎరువుల దుకాణాలన్నింటిని పీఎం కిసాన్ కేంద్రాలుగా మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. వీటిలో ఎరువులు, పురుగు మందులు, భూసార పరీక్షలు, సాగులోని మెళకువలు, ఇతర సేవలను రైతులకు అందించాలి. జూలై 27న రాజస్థాన్‌లో కేంద్రాన్ని ప్రధాని మోదీ లాంఛనంగా ప్రారంభించారు. దీంతో జిల్లాలోని 300 పైచిలుకు వివిధ ఎరువుల కంపెనీలు, ఎరువుల దుకాణాల వద్ద బోర్డులు ఏర్పాటు చేసి కేంద్రాలను ప్రారంభించారు. ఇంటర్‌నెట్ సదుపాయం, ఎల్‌ఈడీ టీవీలు, రైతులు కూర్చునేందుకు కుర్చీలు సమకూర్చారు.

ఇది పరిస్థితి..

కేంద్రం అందించే డీఏపీ, యూరియా, ఇతర కాంప్లెక్స్ ఎరువులను రాయితీతో విక్రయిస్తారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు శాస్త్రవేత్తలతో నేరుగా లేదా ఆన్‌లైన్ ద్వారా పంటల సాగులో రైతులకు ఎదురయ్యే సందేహాలు నివృత్తి చేస్తూ సూచనలు అందించాలి. భూసార పరీక్షలను నిర్వహించి ఫలితాలు తెలియజేయాలి. ఏ ఎరువు ఎంత మోతాదులో వాడాలో చెప్పాలి. కానీ ఇవేవీ అమలు కావడం లేదు. కొన్నిచోట్ల బోర్డులు పెట్టి ఫొటోలు తీసుకుపోయారే తప్పా.. సౌకర్యాలు కల్పించలేదు. ఇదిలా ఉండగా జిల్లాలోని పలు చోట్ల ఎరువులు విక్రయించడం నిలిపివేసిన దుకాణాల వద్ద కూడా బోర్డు పెట్టారంటే చిత్తశుద్ధి ఏపాటిదో అర్థం చేసుకోవచ్చు. జిల్లాలో 300లకు పైగా ఎరువుల దుకాణాలు ఉండగా విడతల వారీగా అన్నింటిని పీఎం కిసాన్ కేంద్రాలుగా మారుస్తామని, అన్ని సౌకర్యాలు కల్పిస్తామని ఎరువుల కంపెనీల అధికారులు తెలిపారు. కానీ ఇప్పటికీ ఎక్కడా కూడా కేంద్రాల ఏర్పాటుకు చర్యలు చేపట్టలేదు.

పర్యవేక్షణ కరువు..

కేంద్రం తలపెట్టిన బృహత్తర కార్యక్రమాన్ని జిల్లా, మండల వ్యవసాయ శాఖ అధికారులు, ఎరువుల కంపెనీల ప్రతినిధులు పర్యవేక్షణ జరపాలి. కానీ వారు పూర్తిగా దూరంగా ఉన్నారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి పుల్లయ్యను 'సాక్షి' సంప్రదించగా పీఎం కిసాన్ కేంద్రాల పనితీరుపై తమకు ఎలాంటి సమాచారం లేదన్నారు. కొన్ని కంపెనీల ప్రతినిధులను వివరణ కోరగా, అన్ని ఎరువుల దుకాణాల్లో రైతుల అవసరాలు తీర్చేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని చెప్పారు. జిల్లాలోనిప్రతి ఎరువుల కేంద్రంలో కేంద్రం నిర్దేశించిన నిబంధనలను పాటిస్తామని తెలిపారు. వాటిని సరిదిద్దేందుకు ఇంకా కొంత సమయం పడుతుందని వివరించారు.


ఎరువుల దుకాణం

ఆదిలాబాద్‌లో కంచి కామకోటి పీఠాధిపతి బస

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని తిరుపల్లి కాలనీలోని బ్రాహ్మణ సమాజ్ శ్రీరామాలయంలో ఆదివారం కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి స్వామి బస చేశారు. చాతుర్మాస దీక్ష ముగించుకొని వారణాసి నుంచి తిరుగు ప్రయాణంలో ఆదిలాబాద్‌కు చేరుకున్న ఆయనకు వేద పండితులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనను దర్శించుకోవడానికి పలువురు భక్తులు తరలివచ్చారు.

మహిళలతో కిక్కిరిసిన బస్టాండ్


డ్రైవర్ స్టీరింగ్ సీట్ నుంచి బస్సు ఎక్కుతున్న మహిళ

నిర్మల్‌టౌన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో ఆదివారం నిర్మల్ ఆర్టీసీ బస్టాండ్ మహిళలతో కిక్కిరిసిపోయింది. నిర్మల్ నుంచి ఆదిలా బాద్ వెళ్లే ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికులు ఎక్కేందుకు పోటీపడ్డారు. బస్సుల్లో సీటు దొరుకుతుందో లేదో అనే భయంతో డ్రైవర్ స్టీరింగ్ సీటు పైనుంచి ఎక్కారు. దీంతో ఏదైనా ప్రమాదం జరగరానిది జరిగితే ఎవరు బాధ్యులని పలువురు చర్చించుకుంటున్నారు. ప్రస్తుతం ఈ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

బాసరకు పోటెత్తిన భక్తులు


బాసర ఆలయంలో భక్తుల రద్దీ

భైంసా: పవిత్ర కార్తీకమాసం అందులోనూ ఆదివారం కలిసిరావడంతో బాసర చదువులమ్మ క్షేత్రం భక్తులతో పోటెత్తింది. రాష్ట్రంతో పాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రల నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. కార్తీకమాస ద్వాదశి శుభముహూర్తం ఉండడంతో గోదావరిలో స్నానాలు ఆచరించి, జ్ఞానసరస్వతీ అమ్మవారిని దర్శించుకున్నారు. దాదాపు 550మంది చిన్నారులకు తల్లిదండ్రులు అక్షరాభ్యాసాలు చేయించారు. అష్టోత్తర కుంకుమార్చన, రుద్రాభిషేకాలు కొనసాగాయి. భక్తులకు అసౌకర్యం కలుగకుండా అన్నివిధాల ఆలయ అధికారులు, సిబ్బంది ఏర్పాట్లు చేశారు. దాదాపు రూ.65వేల వరకు ఆలయానికి ఆదాయ సమకూరింది.

మొక్కు తీర్చుకున్న భక్తులు..

పదేళ్లుగా బాసర జ్ఞానసరస్వతి అమ్మవారి ఆలయం అభివృద్ధికి నోచుకోలేదని, ఈసారి ప్రభుత్వం మారాలని మొక్కుకున్న భక్తులు ఆదివారం తమ మొక్కును తీర్చుకున్నారు. అమ్మవారి ఆలయంలో 101 కొబ్బరికాయలు కొట్టారు. ఇందులో వీరశైవ లింగాయత్ సంఘం కార్యవర్గ సభ్యులు సంజీవ్ రావ్ దేశాయ్, సీనియర్ నాయకులు వినయ్ దేశ్ పాండే తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


ముధోల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో 1991-92వ సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఆదివారం నిర్వహించారు. 31ఏళ్ల తర్వాత వారంత ప్రభుత్వ పాఠశాలలో కలుసుకొని తమ జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. విద్యాబుద్ధులు చెప్పిన గురువులను శాలువతో సన్మానించారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు.